# ప్రాక్టికల్ జోక్

-బి.వి.భద్రగిరీష్




"హలో! 108 అంబులెన్సా అండీ!" ఆదుర్దాగా ఫోన్లో అడిగాడు నవీన్.

"అవును. చెప్పండి ఏం జరిగింది?" అవతల్నుంచి ప్రశ్నించిందో కంఠం.

"ఇక్కడ హైవే మీద నలభయ్యో కిలోమీటర్ దగ్గర యాక్సిడెంట్ అయింది. మోటర్‌బైక్ మీద వెళుతున్న ఇద్దరిని లారీ గుద్దేసిందండీ. ఇద్దరికీ దెబ్బలు తగిలాయి. ఒకతని తల పగిలింది. మీరు అర్జెంటుగా రావాలి" ఆత్రుతగా ఆందోళన నిండిన స్వరంతో చెప్పాడతను.

"సరే, బయలుదేరుతున్నాం" అన్న సమాధానం వినగానే, తన వంకే చూస్తున్న మిత్రుల వైపు నవ్వుతూ చిలిపిగా చూశాడు.

"ఇప్పుడు చూడండ్రా! ఒక అరగంట లోపల 108 అంబులెన్స్ ఇటుగా వెళ్లకపోతే నేను మీకు అయిదు వందలిస్తాను. వెళితే మీరు నాకు అయిదు వందలివ్వాలి. ఇదీ పందెం!" వాళ్ల ఊరు మీదుగా వెళుతున్న హైవే పక్కగా ఉన్న టీ బంకులో మిత్రులతో కలసి కూర్చొని ఉన్నాడు నవీన్. వారితో కలిసి ఇలాంటి ఆకతాయి పందాలు వేయడం అతనికొక సరదా!

"వస్తారంటావా?" ఒక ఫ్రెండ్ అడిగాడు.

"తప్పకుండా! మన యాక్షన్‌కు పడిపోవాల్సిందే!" నమ్మకంగా చెప్పాడు నవీన్. టీ కొట్టు వాడిచ్చిన టీ తాగుతూ, మిత్రులతో కలిసి వెయిట్ చేయసాగాడు. పావుగంట తర్వాత, బొయ్..బొయ్..మని శబ్దం చేసుకుంటూ 108 అంబులెన్స్ హైవే మీదుగా వెళ్లిపోయింది.

దాన్ని చూడగానే పగలబడి నవ్వుతూ మిత్రుల వైపు గర్వంగా చూశాడు నవీన్. "నేనే పందెం గెల్చాను. తీయండ్రా డబ్బులు" డిమాండ్ చేశాడు. ముఖాలు నల్లగా చేసుకొని అయిదొందలు నవీన్‌కి సమర్పించుకున్నారు అతని ఫ్రెండ్స్.కాసేపటికి మిత్రులంతా ఎవరిళ్లకు వాళ్లు బయల్దేరారు.

బైక్ మీద ఇంటికి వెళుతూ, ఇంటి సందు మలుపు తిరిగిన నవీన్‌కు తమ ఇంటిముందు నలుగురైదుగురు గుమిగూడి ఉండటం కనిపించింది. వేగంగా ఇంటిముందు బైక్ స్టాండ్ వేసి ఇంట్లోకి వెళ్లాడు. వరండాలో మంచం మీద నవీన్ నాన్నగారు పడుకొని ఉన్నారు. ఛాతీమీద చేతితో వత్తుకుంటూ ఆయాసపడుతున్నారు. పక్కనే కూర్చొని వున్న తల్లి నీళ్లునిండిన కళ్లతో, ఆందోళనగా ఆయన ఛాతీమీద మర్దన చేస్తోంది. ఆవిడ నవీన్‌ను చూసి బావురుమంది. తండ్రికి హార్ట్ ఎటాక్ వచ్చిందని నవీన్‌కు అర్థమయింది. ఆయనకు షుగరు, బీపీ ఉన్నాయి.

ఇంతలో బయట్నుంచి "108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారా?" అడుగుతున్నారెవరో.

"చేశానండీ! వాళ్లు ఊరికి నలభై కిలోమీటర్ల దూరంలో హైవే మీద ఉన్నారట. అక్కడేదో యాక్సిడెంట్ అయిందని ఆకతాయిలు ఎవరో ఫోన్ చేశారట! వచ్చేసరికి ఎంతలేదన్నా గంట పైనే పడుతుందంటున్నారు. రోడ్డుమీద టాక్సీలేవీ లేవు. అది వచ్చేవరకూ మనకి ఆగక తప్పదు. హాస్పిటల్‌కు వెళ్ళేవరకూ ఈయన బ్రతుకుతారో లేదో?"అన్నాడు పక్కింటాయన.

ఆయన ఎంత మెల్లిగా మాట్లాడినా, ఆ మాటలు నవీన్ చెవిలో పడ్డాయి. తను చేసిన ఆకతాయి పనికి ఫలితం ఇదా అనుకున్నాడు. అతని ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు.

★